ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా







సీనియర్ కార్యకర్త మాచిబోయిన లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు బి.ఆర్.తులసీరావు

బిజెపిని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్తు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ఆర్.తులసీరావు

తిరువూరులో అమరవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి - తిరువూరు : చరిత్రను వక్రీకరించి పరిపాలన చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించకపోతే దేశ భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ఆర్.తులసీరావు అన్నారు. పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని తిరువూరు అమరవీరుల సంస్మరణ సభ స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగింది. ముందుగా సుందరయ్య చిత్రపటానికి తులసీరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కుల మత కలహాలను బిజెపి, ఆర్ఎస్ఎస్ సృష్టిస్తున్నాయన్నారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ వారిని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్పొరేట్లకు ప్రజల సొమ్మును కట్టబెడుతోందన్నారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ అవలంభిస్తున్న వినాశకర విధానాలను రాష్ట్రంలో జగన్, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమర్థించడం దుర్మార్గమన్నారు. ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ఉద్యమించేది సిపిఎం, వామపక్షాలేనని అన్నారు. తిరువూరులో పార్టీ అభివృద్ధికి కషి చేసి ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ కార్యకర్త మాచిబోయిన లక్ష్మీనారాయణను సత్కరించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

ఉపాధి కూలీలపై నిర్దయ

- కేంద్రం చర్యలతో అవస్థలు
- షామియానా, తాగునీటి సౌకర్యాల తొలగింపు
- వేసవిలో అదనపు ఎలవెన్స్‌కు కోత
- ఎండలో మండుతున్న కార్మికులు
- దప్పికతీరక అష్టకష్టాలు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోంది. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్లో ఉపాధి హామీ నిధుల్లో కోత పెట్టడంతో ఈ చట్టం ద్వారా ఉపాధి పొందుతున్న నిరుపేద కార్మికులపై దీని ప్రభావం కనిపిస్తోంది. కార్మికుల సంరక్షణకు క్షేత్రస్థాయిలో గతంలో ఉన్న సౌకర్యాలు ఈ ఏడాది లేకుండా పోయాయి. అంతేగాకుండా వారికి ఇచ్చే సమ్మర్ అలవెన్స్‌కు కోత పెట్టింది. దీంతో రెక్కాడితేగానీ డొక్కాడని తమపై కేంద్రం నిర్దయగా వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మికులు వాపోతున్నారు.

బందరు మండలం సుల్తానగర్‌లో 420 జాబ్ కార్డులున్నాయి. గురువారం 180 మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు. టీనేజర్‌ల నుంచి 85 ఏళ్ల వృద్ధుల వరకు పొలాలకు నీరు వెళ్లే పంట బోదులు తవ్వుతున్నారు. అయితే వేసవి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 5 గంటలకు వచ్చి ఎనిమిది గంటలకే ఇంటికి వెళ్లిపోవాల్సిన పరిస్థితి (మిగతా 6లో)

ఎండల్లో పని సాగడం లేదు

యార్లగడ్డ పూర్ణచంద్రరావు, ఉపాధి కూలీ, సుల్తానగర్

ఇంటి నుంచి 6 గంటలకే వస్తున్నాం. 8 గంటల నుండి ఎండ తీవ్రత మొదలవుతోంది. టెంట్లు లేకపోవడంతో పని ముందుకు సాగడం లేదు. నిర్దేశించిన పని పూర్తికాలేదని రోజు కూలిలో కోత పెడుతున్నారు. కూలి రూ.272 రావాల్సి ఉండగా, కొలతలు తీసి రూ.250 మాత్రమే ఇస్తామంటున్నారు.

సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

చిట్టి బొమ్మ వెంకట దాస్

మార్కెట్లో ఏదీ కొనేట్టు లేదు. రేట్లన్నీ పెరిగిపోయాయి. కానీ కూలి రేటు మాత్రం అరకొరగా పెంచారు. పెరిగిన కూలి కూడా రావడం లేదు. వేసవి ఎండల్లో పని పూర్తిగాక కూలి తగ్గిపోతోంది. గతంలో ఇచ్చినట్లు సమ్మర్ అలవెన్స్ ఇస్తే ఉపయోగంగా ఉంటుంది.

పోర్ట్ నిర్మాణంలో స్థానికులకు ఉపాధి

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం పోర్ట్ నిర్మాణ గ్రామాల్లో స్థానికులకు సివిల్, నిర్మాణ పనులతో ఉపాధి కల్పించాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మచిలీపట్నంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోర్టు నిర్మాణం పనులను ఈనెల 22న ముఖ్యమంత్రి ప్రారంభిస్తుండడాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. మచిలీపట్నంతోపాటు కష్ణా జిల్లా ప్రజల చిరకాల వాంఛగా పోర్టు ఉందన్నారు. దీని నిర్మాణం కష్ణాజిల్లా అభివద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ పోర్టు నిర్మాణానికి 2008లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి తొలిసారి శంకుస్థాపన చేశారని, 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండోసారి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు మూడోసారి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. దీని నిర్మాణానికి 1800 ఎకరాల ప్రభుత్వ భూములను సేకరించారని, వీటిలో అసైన్డ్ భూములతోపాటు ఏక్ సాల్ లీజ్ భూములు కూడా ఉన్నాయని తెలిపారు. వీటిలో వేరుశనగ, కూరగాయలు, (మిగతా 6లో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

నేడు సుందరయ్య వర్ధంతి సభ

స్మారక స్తూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ, మైలవరం : దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు లెనిన్ సెంటరులో జరుగుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. ఈ సభలో వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొంటారని తెలిపారు. సభ ప్రారంభానికి ముందు, తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సానుభూతిపరులు, వామపక్ష శ్రేయోభిలాషులు, సుందరయ్య అభిమానులు, అశేష ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అలాగే మైలవరం మండలం పుల్లూరులో జాతీయ రహదారి పక్కన దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన సుందరయ్య స్మారక స్తూపం ఆవిష్కరణ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని ఆహ్వాన సంఘం అధ్యక్షులు రావూరి రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1987లో సుందరయ్య చనిపోయిన అనంతరం ఏర్పాటు చేసిన ఈ స్మారక స్థూపాన్ని ఇటీవల జాతీయ రహదారి విస్తరణలో భాగంగాఅధికారులు తొలగించారని పేర్కొన్నారు. దీంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్తూప ఆవిష్కరణలో సిపిఎం జిల్లా నేతలు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామారావు కోరారు.



మైలవరం మండలం పుల్లూరులో నిర్మించిన సుందరయ్య స్మారక స్తూపం

ఫ్యాషన్ రంగంలో ఉపాధి అవకాశాలు

ఉత్సాహంగా సిడ్స్ పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఫ్యాషన్ రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులు ఉపాధి అవకాశాలతో పాటు, సృజనాత్మకతతో ప్రతి ఒక్కరూ వ్యాపారాన్ని ప్రారంభించడంతో పాటు మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదుగుతారని సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ చైర్‌పర్సన్ సమానా మూసావి అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ నందు గురువారం కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా తొలత సంస్థ చైర్మన్ సమానా మూసావి మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభం నుండి ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థులకు డిజైనింగ్ రంగంలో కోర్సులను అందించడంతో పాటు వారు సొంతంగా వివిధ సంస్థలను ఏర్పాటుచేసుకునే విధంగా తగిన ప్రోత్సాహం అందించినట్లు తెలిపారు ఇందులో భాగంగానేతమ వద్ద విద్యను అభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు విదేశాలలో ఫ్యాషన్ డిజైనర్లుగా స్థిరపడటంతో పాటు కొంత మంది వివిధ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఎక్కువ మంది సొంతంగా డిజైనింగ్ రంగంలో వివిధ సంస్థలను ప్రారంభించి మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారని తెలిపారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ గుర్తింపుతో తమ వద్ద కోర్సులు చేసిన వారికి సర్టిఫికెట్లను అందిస్తున్నామరి తెలిపారు. బియస్సీ ఫ్యాషన్ డిజైనింగ్‌తో పాటు, బియస్సీ ఇంటీరియర్ డిజైనింగ్‌లలో



మూడేళ్ల డిగ్రీ కోర్సు, రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీ కోర్సులతో పాటు, ఒక సంవత్సరం డిప్లమా కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. వంద శాతం ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తాము చదువుకోవడంలో ఏవిధంగా మెళకువలు నేర్చుకోవడంతో పాటు సొంతంగా ఏవిధంగా యూనిట్లు ప్రారంభించినదీ, వివరించారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సిఎం కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైయస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా పల్లగిరి గ్రామానికి చెందిన రైతు గ్రూపుకు సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలు , మహీంద్రా ట్రాక్టర్ ను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 అందజేయడమే కాకుండా ఆర్.బి.కే కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీలో అందుబాటులో ఉంచడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను కూడా వైయస్ జగన్ ప్రభుత్వం రాయితీపై అందజేస్తుందని తెలిపారు. పల్లగిరి గ్రామంలోని సాయి మారుతి సి.హెచ్.సి గ్రూప్ కు రూ.11.49 లక్షల విలువ యంత్ర పరికరాలను అందజేయడం జరిగిందని, అందులో సబ్సిడీగా రూ.4.39 లక్షలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, జడ్పిటిసి గాదెల వెంకటేశ్వరరావు, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, షేక్ యాకుబ్ అలీ, కో ఆప్షన్ దాసు, ముస్లిం చైతన్య కమిటీ అధ్యక్షులు దుబాయ్ కరిముల్లా, నాయకులు గరికపాటి నానయ్య, అమీన్, మున్నాభాయ్, హనుమంతు శ్రీను, పిల్లి జయరాజు, వ్యవసాయ అధికారి ఖాసిం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక గవర్నర్‌పేటలోని ఆప్కాబ్ కేంద్ర కార్యాలయం ఎదురుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆప్కాబ్ ఎండి శ్రీనాద్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ



మండుతున్న ఎండల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇటువంటి చలివేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నగర ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు, ఆయా రంగాలు విరివిగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ సిజిఎం ఎన్ రాజయ్య, జిఎం పిఎస్ మణిమదమ్, జిఎం బి రామచంద్రయ్య, డిజిఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్ డార్మిటరీలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయవాడ: గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశ్రయ్ పోలీస్ డార్మిటరీని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్



కాంతిరాణా టాటా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ డార్మిటరీని నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఇతర జిల్లాల నుండి బందోబస్త్ నిమిత్తం వచ్చి డార్మిటరీలో ఉంటున్న సిబ్బందితో మాట్లాడి ఆశ్రయ్ పోలీస్ డార్మిటరీలో వసతి ఏర్పాట్లును సంబంధిత అధికారుల వద్ద నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఏ బందోబస్త్ లకు వచ్చారు అనే విషయాలను సి.పి తెలుసుకున్నారు. ఇతర జిల్లాల నుండి బందోబస్త్ నిమిత్తం వచ్చిన సిబ్బంది సౌకర్యార్థం కూలర్ లను ఏర్పాటు చేయాలని, ఫ్యాన్లను, లైట్స్ లు అన్ని పనిచేసే విధంగా చూడాలని డార్మిటరీని, పరిసర ప్రాంతాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నిర్వహణపై డార్మిటరీ సిబ్బందికి తగిన సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో డిసిపి విశాల్ గున్ని, గవర్నర్ పేట ఇన్స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

వీరులపాడులో జగన్మోహనరావు పర్యటన

ప్రజాశక్తి-వీరులపాడు: మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెండ్యాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణ, కోటేరు లక్ష్మి ముత్తారెడ్డి, జడ్పిటిసి అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం,

ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని కాకాని నగర్ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయం నందు గురువారం నాడు చందర్లపాడు మండలం కొత్త కంచల గ్రామానికి చెందిన కొమ్ముకూరు బిక్షాలు, తోటరావులపాడు గ్రామానికి చెందిన దంతమాల మంగయ్య దివ్యాంగుల కు మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య సౌజన్యంతో తెదేపా నేతలతో కలిసి ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ.బిక్షాలు,మంగయ్య లకు కాళ్లు పూర్తిగా సహకరించకపోవడంతో గురువారం ట్రై సైకిల్ పంపిణీ చేయడం జరిగిందన్నారు.ప్రతి ఒక్క పేదవాని యోగక్షేమాలను కాంక్షించే పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు.ఎండలు బాగా తీవ్రతరవుతున్నాయి. ప్రతి ఒక్కరూ వారి నిత్యవసరాల నిమిత్తమే బయటకు వెళ్ళండి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. వికలాంగులు,



వయోవృద్ధులు ఈ ఎండల దష్ట్యా బయటికి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కొమ్ముకూరు బిక్షాలు, దంతమాల మంగయ్య లు తంగిరాల సౌమ్య కి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, దాసరి ప్రభు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏచూరి రాము, కసార్ల లక్ష్మీనారాయణ, అసిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ఎఇఒ వెంకటరెడ్డి సస్పెన్షన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి ఎఇఒగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డి సస్పెండ్‌కు గురయ్యారు. దుర్గగుడి అన్నదానం క్లీనింగ్ కాంట్రాక్టర్ మరుపిళ్ల రవికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్టేడియంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమాలకు వచ్చే వారికి భోజనాల కాంట్రాక్టు కోసం సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చారు. దుర్గగుడి ఈవో లెటర్ హెడ్‌పై అనధికారికంగా సంతకం చేసి వెంకటరెడ్డి సర్వీస్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ళ భ్రమరాంబ గురువారం వెంకటరెడ్డిని సస్పెండ్ చేశారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : వెలంపల్లి

ప్రజాశక్తి-భవానీపురం: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభివద్ధిలో భాగంగా గురువారం మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు 39వ డివిజన్ పరిధిలో నగరపాలక సంస్థ, వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించి డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో



జరుగుతున్న రోడ్ నిర్మాణం, తదితర అభివద్ధి పనులను త్వరతరగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం



ప్రజాశక్తి-నందిగామ: కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను గురువారం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ఏర్పాటు చేశారు.పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో కస్తాల మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 చలివేంద్రాలను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఎండలు పెరిగి అధిక ఉష్ణోగ్రతలతో ప్రయాణికులు, బాటసారులు త్రాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని గ్రహించి తమ మాతమూర్తి మరియమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వేసవి దష్ట్యా ప్రజల దాహార్తి తీర్చడం కోసం ఇతర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థలను అభినందిస్తున్నట్లు చెప్పారు. నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్, టిటిడి కళ్యాణ మండపం, లక్ష్మీ ప్రసన్న థియేటర్, రామన్నపేట బస్టాండ్ సెంటర్, పాత బస్టాండ్ లాంటి ప్రధాన కూడళ్లలో ఐదు చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతేనే బయటకు రావాలని, గర్భిణీలు- చిన్న పిల్లలు -వద్దులు ఎండలో తిరగొద్దని, వడదెబ్బ తగలకుండా తరచుగా నీరు, మజ్జిగ తాగటం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మహమ్మద్ మస్తాన్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఎంపీపీ అరిగెల సుందరమ్మ, ఏఈ ఫణి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు దుబాయ్ కరీముల్లా పాల్గొన్నారు.

ఐసిఐసిఐ డెట్ ఫండ్ విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ సరికొత్త డెట్ ఫండ్‌ను విడుదల చేసినట్లు సంస్థ హెడ్ అరుణ్ శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కస్టమర్లకు ప్రస్తుత అధిక వడ్డీ రేట్లలో తమ పెట్టుబడులను లాక్‌ఇన్ చేయడానికి, దీర్ఘకాలిక సంపదను నిర్మించడానికి, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వీలవుతుందని తెలిపారు. ప్రస్తుత వడ్డీ రేటు విధానం కస్టమర్‌లకు డెట్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌యులిప్, స్పేస్‌లో ఇటువంటి ఫండ్‌ను అందించిన దేశంలోనే మొదటి ఇన్సూరెన్స్ సంస్థగా ఉందని తెలిపారు.

21న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

ఎం.జె.నాయుడు హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన సింగ్‌నగర్‌లోని వివేకానంద హైస్కూల్ నందు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఎం.జె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎముకలు, కీళ్ళు, నరాలు, కండరాల సమస్యలపై ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మెడికల్ క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఈవైద్య శిబిరంలో వైద్య సేవలను అందించడంతో పాటు అవసరమైన వారికి వైద్య పరీక్షలను చేయనున్నారని అలాగే ఉచితంగా మందులను కూడా అందించనున్నట్లు తెలిపారు.

మదర్ ఇండియా విజయవంతం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మదర్స్ డే సందర్భంగా ప్రతిష్టాత్మక అర్మానీ హెూటల్, నందు మదర్ ఇండియా కార్యక్రమం నిర్వహించినట్లు ప్రోగామ్ వ్యవస్థాపకులు నక్కా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లులను గౌరవించడం, గుర్తించడం, మద్దతు ఇవ్వడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-నందిగామ: 16వ వార్డు జానకిరామయ్య కాలనీలో గురువారం టిడిపి పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షులు మల్ల వెంకటేశ్వరరావు తండ్రి కాలేశ్వరరావు వడదెబ్బతో గురువారం మృతిచెందారు. కాలేశ్వరరావు మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండూరు వెంకటరమణ, ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, మనబోతుల శ్రీరామ, హుస్సేన్ రావు, కామా బాబురావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గృహ నిర్మాణం, రీసర్వే వంటి ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి గురువారం జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గృహ నిర్మాణం, రీసర్వే, వ్యవసాయం, జగనన్న పాలవెల్లువ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ ప్రగతి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుండి సిఎస్ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కృష్ణాజిల్లా సాధించిన ప్రగతి సిఎస్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యానికిగాను, జిల్లా లక్ష్యం 15,222 కాగా 14,958 గృహాలు నిర్మాణాలు పూర్తి చేసి 98 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. గడిచిన రెండు వారాల్లో వివిధ నిర్మాణ దశల్లో స్టేజ్ కన్వర్షన్ లక్ష్యం 8838 కాగా, 5 వేల గహాలు నిర్మాణాలు పూర్తి చేసి 56 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. జిల్లాలో రెండో దశలో 60 గ్రామాల్లో రీ సర్వే చేపట్టగా, ఇప్పటి వరకు 30 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయ్యిందన్నారు. 11 గ్రామాల్లో డిఎల్ఆర్ పక్రియ పూర్తి, 7 గ్రామాల్లో ఫైనల్ ఆర్వోఆర్ పూర్తయ్యిందన్నారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం క్రింద ప్రస్తుతం ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్లు అధికంగా ఏర్పాటు చేయడం ద్వారా పాలసేకరణ విస్తరించటానికి కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణ ప్రగతికి సంబంధించి నిర్మాణాలు ప్రారంభించిన 299 గ్రామ సచివాలయ భవనాల్లో 164 భవనాలు పూర్తి చేయగా, 179 ఆర్ బికేలకు గాను 93 పూర్తయ్యాయన్నారు. 130 హెల్త్ క్లినిక్ భవనాలకు గాను 64 పూర్తయ్యాయన్నారు. మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. వైయస్ఆర్ యంత్ర సేవాపథకం క్రింద రైతు గ్రూపులకు హార్వెస్టర్లు, ట్రాక్టర్లు వంటి యంత్రాలు, యంత్ర పరికరాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా సర్వే అధికారి గోపాల్ రాజ్, కె.ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టరు బి.శివన్నారాయణ రెడ్డి, హౌసింగ్ పిడి జి.వి.సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

25, 27 తేదీల్లో పది, ఇంటర్ విద్యార్థులకు అభినందన

జిల్లాలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని ఈనెల 25, 27 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి రాజబాబు తెలిపారు. గురువారం విజయవాడ నుండి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ ప్రకాష్ తదితర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని వారి చాంబర్ నుండి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఇఒ తహేర సుల్తానా, డివిఇఒ ప్రసాద్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ దేవిడ్ రాజు, ఉప విద్యాధికారి సుబ్బారావు, డిసిఇబి కార్యదర్శి మోమిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యతతోనే ప్రత్యామ్నాయం

మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య

ప్రజాశక్తి-అవనిగడ్డ

దేశంలో చీలికలు పీలుకలుగా ఉన్న కమ్యూనిస్టులంతా ఐక్యం కాగలిగితేనే తిరిగి ప్రజల ముందు ప్రత్యమ్నాయ శక్తిగా నిలవగలుగుతామని ఖమ్మం జిల్లా ఇల్లెందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నరసయ్య అభిప్రాయపడ్డారు. దివి కమ్యూనిస్టు సీనియర్ నాయకులు కీర్తిశేషులు పరుచూరి సోమేశ్వరరావు 23వ వర్థంతిని



మాట్లాడుతున్న గుమ్మడి నరసయ్య

అవనిగడ్డలోని ఎస్ బి కే గ్రంథాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. నరసయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టులు బలహీన పడటం వల్లే మతోన్మాద దోపిడీ శక్తులు రాజ్యమేలుతున్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత అప్రజాస్వామిక విధానాలను అలంభిస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా దోపిడీ పాలకులే అధికారంలో ఉన్నారని విమర్శించారు. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, చారు మజుందార్, చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, కొండపల్లి సీతారామయ్య లాంటి మహా నాయకులు ఉద్యమాలకు నాయకత్వం వహించి కమ్యూనిస్టు ఉద్యమాలను బలోపేతం చేశారన్నారు. తొలుత సంత బజార్‌లోని సోమేశ్వరరావు స్థూపం వద్ద గుమ్మడి నరసయ్య ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం సభాస్థలి వద్ద సోమేశ్వర చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. సోమేశ్వరావు తనయుడు, న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో లిబరేషన్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి డి.హరినాథ్, నాయకులు పి.సత్యనారాయణ, మారుబోయిన పులేందర్రావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - మొవ్వ:

పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. గురువారం మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. డిమాండ్లతో రూపొందిన వినతి పత్రాన్ని గ్రామసచివాలయ కార్యదర్శి ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బసవ రత్న కుమారి, శక్తి, సి.హెచ్.మస్తాన్ రావు, ఎస్.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మొవ్వ:

మండల పరిధిలోని పద్దారాయుడు తోట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బత్తిన శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చేందుకు అన్ని చోట్ల అవకాశం ఉన్నంత మేరకు మజ్జిగ పంపిణీ, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కార్యకర్తలను సూచించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులను కుమార్ రాజా బస్సు వద్దకు వెళ్ళి మజ్జిగ అందించి ప్రజాభిమాన్ని చోరగొనే ప్రయత్నంచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యుత జిల్లా ఉపాధ్యక్షులు పెదపూడి ఆనంద్, క్లస్టర్ ఇన్‌ఛార్జి యార్లగడ్డ శ్రీనివాసరావు, మురారి వెంకయ్య, బత్తిన వీరబాబు, పానుగంటి సందీప్, కె. శ్రీనివాస్, సిహెచ్ చిన్నరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-పమిడిముక్కల

వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా పమిడిముక్కల



మండల శాఖా గ్రంథాలయంలో గురువారంనాడు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడారు. పమిడిముక్కల మండలంలోని మేడూరు, అగినపర్రు, కపిలేశ్వరపురం, గురజాడ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఈ శిక్షణా శిబిరాలను కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో బొబ్బ లావణ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు తెలుగు నేర్పించండి : బుద్ధ ప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ముందుగా తెలుగు నేర్పించాలని అధికార భాషా సంఘానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు తెలుగుదేశం పార్టీ వారికి తెలుగు నేర్పిస్తామని ఒక పత్రిక సమావేశంలో చెప్పారన్నారు. ముఖ్యమంత్రి ప్రతి సభలోను తెలుగుని స్పష్టంగా పలక లేకపోవడం విజయబాబు గమనించడం లేదా? అని బుద్ధ ప్రసాద్



ప్రశ్నించారు. గురువింద గింజ తన కింద నలుపుని గుర్తించినట్టే ఇతరులను విమర్శించేటప్పుడు తమ తప్పులను కూడా గమనిస్తే మంచిదని హితవు పలికారు. విజయవాడలో తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య సమావేశంలో తాను ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదన్నారు. విజయబాబు పేరు కానీ ముఖ్యమంత్రి పేరు గానీ ఎత్తలేదన్నారు. తాను అధికార భాష సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎదుర్కొన్న సమస్యలను సాధించిన విజయాల గురించి మాత్రమే మాట్లాడానన్నారు. అప్పటికంటే ఇప్పుడు సాంకేతిక అభివృద్ధి చెందిందని కనుక అధికార భాషగా తెలుగును అమలు చేయడం సులువు అని చెప్పానన్నారు. అనువాద యాంత్రీకరణ వచ్చిన తర్వాత తెలుగును సులువుగా అధికార భాషగా అమలు చేయొచ్చునని చెప్పానన్నారు.

కళా పీఠాన్ని సందర్శించిన సబ్ జడ్జి ఖాసీం

ప్రజాశక్తి - మొవ్వ

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠాన్ని గురువారం నందిగామ సబ్‌జడ్జి ఖాశీం కుటుంబ సభ్యులతో కలసి సందర్శించారు. కళా పీఠం ప్రధాన ఆచార్యులు డా॥ వేదాంతం రామాంజనేయ శాస్త్రి ఆయనకు సాదరస్వాగతం పలికి కళాపీఠం ఏర్పాటు, అభివృద్ధికి తోడ్పడిన కళాకారుల జీవిత విశేషాలను వారి చిత్రపటాలను చూపిస్తూ వివరించారు. ఈ సందర్భంగా కళాపీఠం విద్యార్ధిని విద్యార్దులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలను సబ్‌జడ్జి ఖాశీం తిలకించి విద్యార్ధులను అభినందించారు. శ్రీ బాలాత్రిపుర సుందరీ గ్రంధాలయ పాలకులు వై.వి. ఫణికుమార్, కళాపీఠం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - మొవ్వ:

బడుగు-బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా చంద్రబాబు నాయుడు చేసిన అప్రజాస్వామిక అహంకార పూరిత వ్యాఖ్యలు ఖండిస్తూ మొవ్వ మండలం నిడుమోలులో పామర్రు శాసన సభ్యులు కైలే అనీల్ కుమార్ ఆధ్వర్యంలో వైకాపా శ్రేణులు గురువారం నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అనీల్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించారు. పేదలకు అహంకారవాదులకు మధ్య రాష్ట్రంలో యుద్ధం జరుగుతోందన్నారు. చంద్రబాబు వెంటనే క్షమాపణ చెప్పాలనీ, చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు వైకాపా శ్రేణులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్

పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి : వెంకట్రామ్

ప్రజాశక్తి-అవనిగడ్డ

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేసేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన సమస్యలైన అవనిగడ్డ-కోడూరు రహదారి, ఎదురుమండి వారధి, రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటోందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు అందే పరిస్థితి లేదన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతాంగ సమస్యలపై పార్టీ శ్రేణులు స్పందించిన తీరుపై వెంకట్రామ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, నడకుదుటి జనార్ధనరావు, మోర్ల రాంబాబు, రావి రత్నగిరి, మండలి ఉదయ భాస్కర్, బండే రాఘవ, యార్లగడ్డ శ్రీనివాసరావు, మత్తి శ్రీనివాసరావు, ఘంటసాల రాజమోహనరావు, బచ్చు రఘునాథ్, షేక్ బాబావాలి, బర్మా శ్రీనివాసరావు, ఎలవర్తి చిన్న, పుల్లగోరు రాజేందర్రావు, చెన్ను గాంధీ, మెగావత్ గోపి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కూరగాయల సాగు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం నెలకుర్రు, గొల్లపాలెంలోని రైతుగౌరిపర్తి వీర వెంకట్రావు తనకున్న ఒక ఎకరా పొలంలో వేసవిలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానంలో పలు పంటల విధానాన్ని కొనసాగిస్తున్నారని మచిలీపట్నం మండల వ్యవసాయ శాఖాధికారి జి.వి.శివప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి (డిపిఎం) కె.పార్థసారధితో కలసి ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలించారన్నారు. రైతు తాను 5 సంవత్సరాల నుండి ఘన జీవామృతం, నవధాన్యాల సాగును నిర్వహిస్తున్నానని ఈ సంవత్సరం (ఎటిఎం)ఎనీ టైం మనీ అనే కాన్సెప్ట్ తో బెండ, బీర , దోస,గోంగూర, పశువులకు మేత కోసం జొన్న, పిల్లిపెసర సాగుచేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎ ప్రశాంత్, దీపిక పాల్గొన్నారు.

సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి : బాబూరావు

ప్రజాశక్తి-సింగ్‌నగర్: పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం లెనిన్‌సెంటర్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కోరారు. గురువారం 58, 60, 61, 63, 64, వడ్డెర కాలనీ, ఎక్సెల్ ఫ్యాక్టరీ వాంబే కాలనీ, ఉడా కాలనీ, కండ్రిక ప్రాంతాల్లో సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కార్మికులు, కష్టజీవుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ పరిష్కారానికి కృషి చేశారన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించి కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకువస్తూ కార్మికులకు పోరాడే హక్కు లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కుల, మత ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తుందని, ఈ తరుణంలో ప్రజలందరూ ఐక్యమత్యంతో సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎంరాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, జి.ఝాన్సీరాణి, ఎస్.కె.పీరు సాహెబ్, నాయకులు బొంగు రాంబాబు, ఎం.వి



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ఆంజనేయులు, ఎ.నాగబ్రహ్మం, పి.వెంకటరెడ్డి, పి.సాంబిరెడ్డి, ఎం.హనుమంతరావు, ఇమ్మంది నాగరాజు, ఎస్.కె.ఆబీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కంచికచర్ల: క్రీడలు యువతలో మానశిక ఉల్లాసానికి దోహదపడతాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. జై భీమ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ లో జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో మానసిక వికాసం కలుగుతుందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహ భావం పెంపొందుతుందని, అంతేకాకుండా ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడి, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అదేవిధంగా వేసవిలో తీవ్రమైన ఎండలు నమోదవుతున్న కారణంగా క్రీడాకారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం కొద్దిసేపు క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





స్విమ్మర్లకు టీషర్టులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 27, 28 తేదీల్లో ఢిల్లీలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనున్న స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు టీ షర్టులను గురువారం మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అందజేశారు. పట్టణంలో పాలేటి నది ఒడ్డున డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని స్విమ్మింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ముందుకు తీసుకెళ్తున్న క్రీడాకారులు అందరినీ ప్రశంసించారు. ఈ సందర్భంగా డ్రీమర్స్ అసోసియేషన్ మెంబర్స్ చైర్మన్‌కి చిరు సత్కారం అందజేశారు. కోచ్ పాండురంగారావు దంపతులకు కతజ్ఞతలు తెలియజేస్తూ వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్‌రావు, యలదండి శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ మండదపు శ్రీనివాసరావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, కళాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న డ్రిల్స్ తొలగించాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 50డి విజన్ మహంతిపురం అప్పలస్వామి వీధిలో కల్వర్టు మీద వేసిన ఐరన్ డ్రిల్లు రోడ్డుకి ఎత్తు ఉండడం వలన ప్రమాదాలకు నిలయంగా మారిందని 50వ డివిజన్ కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం డివిజన్ పర్యటనలో స్థానిక ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను కార్పొరేటర్ బి సత్యబాబు దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించమని నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారులకు సత్యబాబు వెంటనే ఫిర్యాదు చేశారు. రోడ్డు కంటే ఎత్తులో లేకుండా కల్వర్టుపై ఇనుప డ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో ఏ. శ్రీనివాస్, కే. సత్యనారాయణ, భాష తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు కంటే ఎత్తులో కల్వర్టుపై వేసిన ఐరన్ డ్రిల్స్ పరిశీలిస్తున్న సత్యబాబు

చింతా సుబ్బారావు వర్ధంతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేద ప్రజల కోసం అనేక భూ ఉద్యమాలు ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నిర్వహించిన కామ్రేడ్ చింతా సుబ్బారావు 11వ వర్ధంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నం వెలగా లక్ష్మణరావు భవన్ నందు చింతా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు మాట్లాడుతూ నిరుపేద ప్రజల కోసం పోరాడిన చింతా సుబ్బారావు ఇబ్రహీంపట్నం మరియు మైలవరం నియోజకవర్గంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలలో పాల్గొని పేద ప్రజల గుండెలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఆలేటి విఠలరావు పట్టణ కార్యదర్శి యం మహేష్ తోపుడు బండ్ల యూనియన్ అధ్యక్షులు జి రమణమ్మ కోశాధికారి నవీన్ సభ్యులు విజయ్ నాయుడు వెంకటేశ్వరరావు శ్రీరాములు పాల్గొన్నారు.



బాలలకు యోగా శిక్షణ

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల, శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం 11వ రోజు నిర్వహించారు. ఉపాధ్యాయులు దారం ప్రసాద్ క్రమశిక్షణ, సేవాభావం, స్వీయ అభివృద్ధులపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. తెలుగు మాస్టర్ ఇస్మాయిల్ మ్యూజియంలో ఏఏ వస్తువులు భద్రపరుస్తారో తెలియజేశారు. యోగా మాస్టర్ నారాయణ విద్యార్థులకు సూర్యనమస్కారాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు,రి టైర్డ్ లైబ్రేరియన్ రంగిశెట్టి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు పెరయ్య, శ్రీను, బాలకోటయ్య, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: నందిగామ మండలం కొండూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ చిన్న ప్రకాష్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ శాస్త్ర చికిత్స చేయించుకున్న నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 3.60 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, కోనతమాత్మకూరు గ్రామ సర్పంచ్ మేడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

ఈ నెల 17వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ మల్లేశ్వరరావు కోరారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, టోపీలు, పరుపులు, బెడ్ షీట్లు, దుప్పట్లు, పుస్తకాలు, బ్యాగ్ లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్లు, చెక్క కుర్చీలు, ఇనుప కుర్చీలు, టేబుల్స్, చెక్క మంచాలు, ఇనుప మంచాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వస్తువులను ఈ సెంటర్‌కు అందిస్తే వాటిని అవసరం ఉన్న ఇతరులకు అందచేస్తారని తెలిపారు. వస్తువులు ఇవ్వదలచిన వారు తమ ఏరియాలోని సచివాలయ శానిటేషన్ సెక్రటరీకి సమాచారం ఇవ్వాలని సూచించారు.

'జగన్ కుటిల రాజకీయాలను ప్రజలు గమనించాలి'

ప్రజాశక్తి-వన్‌టౌన్: జగన్ ప్రభుత్వం కుటిల రాజకీయాలను ప్రజలు గమనించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతు పేదలకు రాజధానిలో ఇళ్ళ పట్టాల పేరుతో మరో గారడీ చేస్తున్నారని, పేదల మీద అంత ప్రేమ ఉంటే నాలుగేళ్లుగా పట్టణాల్లో టిడిపి హయాంలో నిర్మించిన లక్షల టిడ్కో ఇళ్ల 10శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జగన్ కక్షపూరిత రాజకీయంతో టిడిపి పేరు వస్తుందని అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం నిర్మాణాలు పాడవుతున్నాయని విమర్శించారు. లబ్ధిదారులు అద్దె భారంతో పాటు కార్పొరేషన్, మున్సిపాలిటీలకు చెల్లించిన సొమ్ముకు వడ్డీ భారం కూడా మోస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసారు. సెంటు, సెంటున్నర భూమి ఇస్తే 10 లక్షల రూపాయలు పెట్టుకొని ఇళ్ళు కట్టే స్థోమత పేదలకు ఉందా? అని ప్రశ్నించారు. చిత్త శుద్ధి ఉంటే విద్వేషాలు సష్టించకుండా దశాబ్దాలుగా నివాసముంటున్న గ్రామాలలో ఇళ్ళు కట్టి ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్‌చేసారు. 2019 లో టీడీపీ అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్ళు ఋణం కూడా రద్దు చేసి ఉచితంగా స్వంత ఇంటి కల నెరవేర్చేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్యాలెస్ లకు 60 ఎకరాలు భూమి ఉండాలి, వైసిపి పార్టీ కార్యాలయాలకి రెండెకరాల భూమి ఉండాలి, కానీ పేద వారికి మాత్రం 1.5 సెంటు భూమి సరిపెట్టుకోవాలి, ఇదేనా వైసిపి చిత్తశుద్ధి అంటూ పెందుర్తి ఎద్దేవా చేశారు.

'సెయింట్ జాన్' ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ

ప్రజాశక్తి-భవానీపురం: ఫస్ట్‌ఎయిడ్‌లో శిక్షణ తీసుకుంటే సామాన్యులు కూడా అత్యవసర సమయాల్లో గుండెపోటు బారినపడిన వారిక ప్రాథమిక చికిత్స అందించవచ్చని సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కోలా విజయశేఖర్ అన్నారు. గురువారం భవానీపురంలోని ఆల్‌మైటీ నర్సింగ్ హోమ్‌లో సెయింట్ జాన్ ఆంబులెన్స్ అసోసియేషన్, జెమ్స్ అలైడ్ ఇన్‌స్టిట్యూట్ పారామెడికల్ కోర్సెస్ ఆధ్వర్యంలో ధన్‌బాద్ మైన్స్ డిపార్ట్‌మెంట్‌వారి గుర్తింపు పొందిన ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్లను శిక్షణ పొందిన వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోలా విజయశేఖర్ మాట్లాడుతు గత 25 సంవత్సరములుగా జిల్లా వ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబడుతున్న సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ ఫస్ట్ ఎయిడ్, హోమ్ నర్సింగ్ ,పవర్ మెడిసిన్, శానిటేషన్, కోర్సుల యందు శిక్షణ ఇచ్చి, పరీక్షానంతరం సర్టిఫికెట్‌లను ఇచ్చి ఎంతోమందికి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. సెయింట్ జాన్ అంబులెన్స్ అసోసియేషన్ అనునది బ్రిటిష్ మహారాణి కాలంలో యునైటెడ్ కింగ్‌డమ్ లండన్



నందు స్థాపించబడిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమములో ప్రథమ చికిత్స -ప్రాణ రక్షణ, ప్రాణాపాయ పరిస్థితులలో రోగి ప్రాణం కాపాడు విధానం, ప్రమాదం సంభవించినప్పుడు వైద్య సహాయ చర్యలను అందించుట, గ్రామాలలో సంభవించు పాముకాటు, కుక్కకాటు ,విషం సేవించుట, నీట మునుగుట, కరెంట్ షాక్ మొదలగు ప్రాణాపాయ పరిస్థితులు గురించి అందరికీ అనగా యువతకు, కర్మాగారములలో పనిచేయుచున్న కార్మికులకు, రైతులకు, విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధికారులకు, అనధికారులకు, ఆయా ప్రాంతములలో జరుగు ప్రాణాపాయ పరిస్థితుల గురించి వివరించి, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా చేయుటకు కషి చేయుచున్నామని ఆయన చెప్పారు. తమ సంస్థ యందు ఉన్న ఎక్విప్‌మెంట్‌ను పరిశీలించిన తరువాత సెంట్రల్ గవర్నమెంట్ మైన్స్ డిపార్ట్మెంట్ ధన్బాద్ వారు గనులలో పనిచేయుచున్న వారికి, ఇండస్ట్రీస్‌లలో పనిచేయుచున్న వివిధ కార్మికులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇచ్చుటకు మాకు అనుమతి ఇచ్చారన్నారు. మా సంస్థ ద్వారా ఈ శిక్షణా తరగతులను నిర్వహించి అర్హత కలవారికి సర్టిఫికెట్స్ అందచేస్తున్నామన్నారు. మరిన్ని వివరములకు 9849182140 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వక్కలగడ్డ భాస్కరరావు, వాసవి ఫార్మా మార్కెట్ కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు , డాక్టర్ సురేష్, డాక్టర్ భవాని శంకర్ మాట్లాడుతు వైద్యరంగంలో డాక్టర్ కోలా విజయశేఖర్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరికీ ఫస్ట్‌ఎయిడ్‌పై అవగాహన అవసరమని అన్నారు.

ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు సమరశీల పోరాటం

ప్రజాశక్తి-యంత్రాంగం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రక్షణకు సమరశీల పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా గురువారంనాడు అధ్యయన యాత్రలు కొనసాగాయి. పామర్రు: పామర్రు మండలం జుజ్జువరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై.నరసింహారావు, ప్రజా సంఘాల నాయకులు గంగాధర్ ప్రసాద్, కె.నాగభూషణం ఉపాధి హామీ పనులను పరిశీలించి పనిచేస్తున్న కూలీల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వై.నరసింహారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. అందులో భాగంగానే పొమ్మనలేక పొగ పెట్టినట్లు ప్రతి సంవత్సరం బడ్జెట్లో కోత విధిస్తోందన్నారు. గతంలో కూలీలకు మంచినీళ్లు, టెంటు, గడ్డపార రిపేరు చేసుకునే ఖర్చులు, మజ్జిగ, ఫస్ట్ ఎయిడ్ కిట్ మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించారని గుర్తుచేశారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం వాటిని ఆపేసిందన్నారు. పేరుకు 100 రోజులు పని అని చెప్పి కొన్నిచోట్ల 50 రోజులు కూడా చూపించని మండలాలు కృష్ణాజిల్లాలో ఉన్నాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి హామీ పనిని 200 రోజులు చూపించాలని, కూలి రోజుకు రూ.600 ఇవ్వాలని, గతంలో మాదిరిగా మౌలిక సదుపాయాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అందులో భాగంగానే ఈనెల 29న మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జుజ్జువరం సచివాలయ అధికారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



మాట్లాడుతున్న వై.నరసింహారావు



చల్లపల్లి మండలంలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు



మోపిదేవి మండలంలో పర్యటించిన నాయకులు

మౌలిక వసతులు కల్పించాలి

చల్లపల్లి : మండలం వెలివోలు గ్రామంలో సీఐటియు మండల కార్యదర్శి ఎండీ కరీముల్లా ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చటానికి అనేక పద్ధతులను అవలంభిస్తోందన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న కారణంగా వడగాల్పులు వీస్తునందున కార్మికులు సేద తీరేందుకు షామియానాలు, మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దినసరి వేతనం రూ.600 ఇవ్వాలనీ, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలనీ, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.26 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 29న మచిలీపట్నంలో జరిగే ధర్నాని జయప్రదం చేయాలని ఉపాధి హామీ కార్మికులకు పిలుపు నిచ్చారు.

29న ధర్నా జయప్రదానికి పిలుపు

మోపిదేవి : మోపిదేవి మండలం అన్నవరం, గొల్లపాలెం గ్రామాల్లో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి కూలీలను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బండి ఆదిశేషు మాట్లాడారు. ఉపాధి కూలీల హక్కుల సాధనకై ఈనెల 29న మచిలీపట్నంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు 210 దినాలు కావాలనీ, కేరళ తరహాలో రోజు కూలి రూ.600 ఇవ్వాలనీ, జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో వేసవిని పురస్కరించుకుని గురువారం నియోజవర్గ పరిధిలో పలుచోట్ల వేసవి నుండి దాహార్తిని తీర్చుకోవటానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు బండి రామకష్ణ తెలిపారు. వేసవి కొనసాగినంత కాలం ప్రతిరోజు మజ్జిగ, శీతలపానీయాలు మినరల్ వాటర్, చలివేంద్రాల్లో అందు బాటులో ఉంచుతామన్నారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు మాట్లాడుతూ మజ్జిగ పంపిణీని పినిశెట్టి కుమారి సహకారంతో జనసేన పార్టీ శ్రేణులు పాదచారులు, బాటసారులు, ప్రయాణికులు, వాహనదారులకు మజ్జిగను అందజేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేనపార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, డివిజన్ ఇన్‌ఛార్జిలు ఈవన మణిబాబు, తోట భాస్కర్, శాయన శివ, సుదర్శన్, కందుల ఫణి, సత్తిబాబు, దాదా, రాజేష్, కర్రీ మహేష్, వీర మహిళలు పినిశెట్టి కుమారి, మానేపల్లి ఉషారాణి జనసేన పార్టీ నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.



కొడాలి నానిని ఓడిస్తా : రావి

ప్రజాశక్తి-గుడివాడ

మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిని ఓడించి గుడివాడ అభివృద్ధి అంటే ఇది అనే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆదేశాల మేరకు 150 రోజులుగా 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని పూర్తిచేశామన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో వాటిని ఎన్నికల ఎజెండాలో పెట్టి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గుడివాడ నుండి కొడాలి నానికి మంత్రి పదవి ఇస్తే రూ.10వేల కోట్లు మట్టి, ఇసుక, పేకాట, గంజాయిల వ్యాపారం చేసి సంపాదించావన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, సన్యాసిరావు, మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు పంద్రాజు సాంబశివరావు, పోలాసి ఉమా, గోవాడ శివా, షయ్యద్ జబీన్, తదితరులు పాల్గొన్నారు.




మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-ఘంటసాల

మండల పరిధిలోని పూషడం గ్రామానికి చెందిన పాశం కనకదుర్గ (44) బుధవారం మృతి చెందగా, వైఎస్సాఆర్ బీమా పథకానికి అర్హురాలు కావటంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు గురువారం కుటుంబ సభ్యులకు లంకపల్లి పీఏసీఎస్ చైర్ పర్సన్ గల్లా గిరీష్, గ్రామస్తులు చీడేపూడి శ్రీనివాసరావుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గిరీష్ మాట్లాడుతూ వైఎస్సాఆర్ బీమా పథకం కింద కనకదుర్గ కుటుంబానికి రూ.లక్ష మంజూరు కాగా, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు తొలి విడతగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రెడ్రోతు రాము తదితరులు పాల్గొన్నారు.





అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు


స్థానిక లయన్స్ సేవాభవన్‌లో గవిర్నేని(సజ్జా) లలితకుమారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారంతో గురువారం అన్నదానం జరిగింది. పండ్లు పంపిణీచేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, దాతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి ఎంపిపై చర్యలు తీసుకోవాలని నిరసనలు

ప్రజాశక్తి-బంటుమిల్లి

ఢిల్లీలో మహిళా క్రీడాకారులపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంటుమిల్లి లక్ష్మీపురంసెంటర్లో గురువారం నిరసన కార్యక్రమం జరిగింది. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పరుచూరి ధనశ్రీ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. దేశానికి ప్రతిష్ట తీసుకొచ్చిన క్రీడాకారులపై లైంగిక వేధింపులను ఖండిస్తున్నామని వెంటనే ఆయన్ను అరెస్టు చేయాలని ఆమె డిమాండ్‌చేశారు. ఎపి రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించినప్పుడు మన దేశానికి మంచి పేరు తెచ్చారని పొగిడిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ క్రీడాకారులపై సాక్షాత్తు ఆ పార్టీకి చెందిన ఎంపి లైంగిక వేధింపులు పాల్పడినా చోద్యం చూస్తున్నాడని విమర్శించారు. ఇదేనా? దేశభక్తి అంటే అని ఆయన ప్రశ్నించారు. నిజమైన దేశభక్తి మీకు ఉంటే దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారులపై లైంగిక వేధింపులు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు మాజేటి శివ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, వృత్తిదారుల సంఘం నాయకులు పొదిలి వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు నాగరాజు, నాగిశెట్టి కృష్ణ, సిఐటియు నాయకులు సలీం, వంగల రాజు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** బిజెపి ఎంపీ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డబ్ల్యూ ఎఫ్ఐ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ రెజ్లింగ్ ఫెడరేషన్‌లోని కొంతమంది అధికారులు లైంగిక వేధింపులు, అణిచివేతకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో మహిళారెజ్లర్లు చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.కొండ, సిఐటియు నాయకులు హఫీజా, ఆదిలక్ష్మి, జిమ్ నాయకులు ఉష, లోహిత్, ప్రణవి, లలిత, కౌశిక్ తదితర మహిళలు పాల్గొన్నారు.





క్రైస్తవులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

క్రైస్తవులకు అన్ని విధాలుగా విధంగా వెనిగండ్ల రాము అందుబాటులో ఉంటారని వెనిగండ్ల ఫౌండేషన్ ప్రతినిధి గొర్రెముచ్చు నరసింహారావు అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలోని బుధవారం జరిగిన ఏసుక్రీస్తు రక్షణ సువార్త సభల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము పంపించిన కానుకను సంఘ కాపరులు అరుణ్ కుమార్‌కు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మావతి, తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ, రామాపురం మాజీ సర్పంచ్ అందుగుల యేసుపాదం, వెనిగండ్ల ఫౌండేషన్ ప్రతినిధి గొర్రెముచ్చు వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, సుమారు 300 మంది దైవజనులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వాహన త్రైమాసిక పన్ను తగ్గించాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి

కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం 25 నుంచి 30 శాతం మేర రవాణా వాహనాల త్రైమాసిక రహదారి పన్ను పెంచుతూ తెచ్చిన జీవో 31ను ఉపసంహరించుకోవాలని ది కష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని అసోసియేషన్ హాలులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పక్క రాష్ట్రాల కన్నా అధిక చమురు ధరలతో, రూ.200 నుండి రూ.22 వేలకు పెరిగిన హరితపన్నుతో ఇప్పటికే రవాణారంగం సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. లారీ యజమానుల సంఘం విజ్ఞప్తులు కూడా పట్టించుకోకుండా ప్రభుత్వం జీఓ 31 తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ పెంపుపై ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఉపాధ్యక్షులు కోనేరు నాగేశ్వరరావు మాట్లాడుతూ లారీ యజమానుల పరిస్థితి రైతులు కన్నా దారుణంగా ఉందన్నారు. పంటలకు మద్దతు ధరల మాదిరిగానే ప్రభుత్వమే రవాణా వాహనాలకు కిలోమీటరుకు రవాణా ధర నిర్ణయించాలన్నారు. ఉపాధ్యక్షులు మద్ది వెంకట కష్ణారెడ్డి మాట్లాడుతూ రవాణా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసంగా కూడా పట్టించుకోవడంలేదన్నారు. ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీర వెంకయ్య మాట్లాడుతూ రవాణా పన్నులభారం కారణంగా లారీ యజమానులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొత్తగా ఈ రంగంలోకి వచ్చేవారు వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శించారు. కార్యదర్శి ఆళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లారీ పరిశ్రమ ఇక్కడి పన్నుల కారణంగా పక్క రాష్ట్రాలకు తరలిపోతే ఎపి ఆదాయం కోల్పోతుందని హెచ్చరించారు. కార్యదర్శి వి.కష్ణంరాజు మాట్లాడుతూ రవాణా పరిశ్రమకు ప్రభుత్వ సహాయం దాదాపు శూన్యమని విమర్శించారు.



రమాదేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు తదితరులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి ప్రసాద్ సోదరి రమాదేవి మృతి

ప్రజాశక్తి - మైలవరం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి కుంటముక్కల శ్యామల వరప్రసాద్ సోదరి రమాదేవి (70) గురువారం తెల్లవారు జామున మరణించారు. అనారోగ్యం కారణంగా ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలోని తన స్వగహంలో చనిపోయిన ఆమె అవివాహితురాలు. ప్రసాద్‌కు ముగ్గురు అక్కలు, చెల్లెలు ఉన్నారు. వీరిలో రమాదేవి పెద్ద అక్క. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.వి.ఆంజనేయులు, మండల కార్యదర్శి రావూరి రమేష్‌బాబు, సిఐటియు మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల కార్యదర్శులు సిహెచ్.సుధాకర్, ఎం.మహేష్, సిపిఎం నాయకులు మోహన్ రావు, ఇస్సాక్, నాగేశ్వరరావు, శేషయ్య ప్రజాశక్తి ఫొటోగ్రాఫర్ టి.వి.రమణ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రమాదేవి అంత్యక్రియలు జరిగాయి.



రమాదేవి (పాతచిత్రం)

ఎన్నికల ప్రక్రియ విధివిధానాలపై అవగాహన అవసరం

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మీనా

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల ప్రక్రియను సజావుగా సక్రమంగా నిర్వహించేలా ఎన్నికల కమిషన్ నిర్దేశిస్తున్న విధి విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఇవోలు, ఏఆర్‌వోలు ఈఆర్‌వోలతో సచివాలయం నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టర్ విడిది కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నామినేషన్ ప్రక్రియపై వివరిస్తూ ఎన్నికలు జరిగే సమయంలో అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలన్నారు. నామినేషన్లు స్వీకరించిన అనంతరం పరిశీలన తుది అభ్యర్థుల జాబిత ప్రచురణ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్ కుమార్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌డిఏ పిడి కె. శ్రీనివాస్, ఆర్‌డివోలు రవీంద్రరావు, వైవి ప్రసన్న లక్ష్మి, ఉన్నారు.రీసర్వేపై సమీక్ష

రీసర్వేపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : రీసర్వే, జాతీయ రహదారుల విస్తరణ, గృహ నిర్మాణాల స్టేజ్ కన్వర్షన్, తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్ జవహర్ రెడ్డి ఆయన కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రీసర్వే, జాతీయ రహదారుల విస్తరణ, గృహ నిర్మాణాలు, జగనన్న పాల వెలువ, తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు.

మొదటి పేజీ తరువాయి

ఉపాధి కూలీలపై నిర్దయ

ఏర్పడింది. దీంతో నిర్దేశించిన పని పూర్తిగాక రోజువారీ వచ్చే కూలిలో కోత పడుతోందని కూలీలు వాపోతున్నారు. రోజు కూలిని ప్రభుత్వం రూ.272 నిర్ణయించగా, రూ.250 విలువగలిగిన పని మాత్రమే చేయగలుగుతున్నారు. ఈ సమస్య ఒక్క సుల్తానగర్ గ్రామంలోని పరిస్థితి మాత్రమే కాదు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉంది. జిల్లాలో మొత్తం 2,14,795 జాబ్ కార్డులుండగా, రోజుకు సగటున లక్ష మంది ఉపాధి పనులకు వెళుతున్నారు. వీరందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇటీవల కాలంలో మార్కెట్లో నిత్యావసరాల ధరలు భారీగా పెరిగిగాయి. కానీ గతంలో పోల్చినప్పుడు ఈ ఏడాది ఉపాధి కూలీకి రోజుకు రూ.12 మాత్రమే ప్రభుత్వం పెంచింది. అంతేకాదు ప్రతి ఏటా అందుబాటులో ఉండే షామియానాలు, టెంట్లను, మంచినీటిని ఈసారి లేకుండా పోయాయి. వీటి ఏర్పాటుకు ఇచ్చే నిధులను కేంద్రం నిలిపివేసింది.

కార్మికులపై భారం

మంచినీటికి ఒక్కో మనిషికి రోజుకు రూ.7.50, ఫస్టెయిడ్‌కు రూ.3, టెంట్‌కు రోజుకు రూ.3 ఇచ్చేవారు. ఫిబ్రవరి నుంచి మార్చి 15వ తేదీ వరకు సమ్మర్ అలవెన్స్ 30 శాతం అదనంగా ఇచ్చేవారు. అలాగే మార్చి 15 నుంచి జూన్ 13వ తేదీ వరకు 50 శాతం అదనంగా సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు. ఒక్కో వ్యక్తిని పిలిచినందుకు మేట్లకు రూ.3 ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఇవన్నీ తొలగించారు. రోజుకు పొలుగు సానపెట్టడానికి రూ.14.50 చొప్పున, తట్టకు రూ.3 ఇవ్వాలి. ఇప్పుడు అన్నీ కోత పెట్టారు. దీంతో పొలుగులు సరిపించడానికి, తట్టల కొనుగోలుకు కూలీలకు వచ్చే వేతనంలోనే ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది.

పోర్టు నిర్మాణంలో స్థానికులకు ఉపాధి

ఆకుకూరలు, సరుగుడు పంటలు వేసుకుని ప్రజలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దీంతో పోర్టు నిర్మాణ గ్రామాల్లోని ప్రజలకు ఉపాధి పోయిందని పేర్కొన్నారు. అందువల్ల ఆ గ్రామాల్లోని ప్రజలకు పోర్టు నిర్మాణ, సివిల్ పనుల ద్వారా ఉపాధి కల్పించాలని కోరారు. ఆ గ్రామాల్లో చదువుకున్న యువకులకు శిక్షణ ఇచ్చి పోర్టులో ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాల రావు, సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్.జయరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల చేతుల్లో ప్రభుత్వ భూములుంటే స్వాధీనం : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం

నియోజకవర్గంలో రెండోవిడత ఇళ్ల స్థలాల పంపిణీ కోసం అవసరమైన స్థలాల కోసం అన్వేషిస్తున్నామని గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ చెప్పారు. గన్నవరం మండలం సూరంపల్లి, వెదురుపావులూరు, మాదల వారి గూడెం గ్రామాల పరిధిలో గురువారం ఆయన



ఆక్రమణ భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ

విస్తృతంగా పర్యటించారు. వెదురుపావులూరు పరిధిలోని ఆర్ఎస్ నం.308లో టిడిపి మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు ఆక్రమణలో ఉన్న భూములను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత సూరంపల్లి పరిధిలో వెంకటేశ్వరరావు ఆధీనంలో ఉన్న కొండ గట్టుకు ఆనుకుని ఉన్న 12 ఎకరాలను చూశారు. మాదల వారి గూడెం పంచాయతీ పరిధిలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములు, సూరంపల్లి పారిశ్రామిక వాడ ఏరియాలో ఆక్రమణలో ఉన్న భూములను ఆయన పరిశీలించారు. సూరంపల్లి రెవెన్యూ పరిధిలో 375, 354 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములు, నాన్ ఇరిగేషన్ ట్యాంక్‌లను వంశీ పరిశీలించారు. తహశీల్దార్ నరసింహారావు దగ్గర ఉండి రెవెన్యూ రికార్డు ప్రకారం ఉన్న అన్ని ప్రభుత్వ భూములను వంశీకి చూపించారు. ఈ భూములన్నీ పెద్దల ఆక్రమణలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వంశీ స్పందిస్తూ సదరు భూములన్నింటినీ సర్వే చేయించి ఒక రికార్డు తయారు చేసి తనకు ఇవ్వాలని, దానిని సిఎం జగన్మోహన్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వంశీ విలేకరులతో మాట్లాడారు. గన్నవరం మండలంలో నవరత్నాలలో భాగంగా మొదటి దశలో ఎక్కువ శాతం అర్హులైన పేదలకు ఇళ్ళు స్థలాలు పంపిణీ చేశామన్నారు. రెండో దశలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అనువైన ప్రదేశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రైవేటు భూములను కోట్లాది రూపాయలను పెట్టి కొనుగోలు చేసే పరిస్థితి లేదని, అందువల్ల ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో గుర్తించి సేకరించడం ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సులభం అవుతుందని చెప్పారు. సూరంపల్లి, వెదురుపావులూరు, మాదల వారి గూడెం గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయని, కొన్నేళ్లుగా కొంతమంది పెద్దలు వాటిని ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని రెవెన్యూ అధికారులు తన దృష్టికి తేవడంతో వాటిని నేరుగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకునేందుకు విస్తృతంగా పర్యటన చేశామన్నారు. పేదలకు సొంతింటి కల, భూమి కావాలనే ఆశను తీర్చడానికి తాను కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని, ప్రభుత్వ భూములు తీసుకోవడం ద్వారా పేదలకు సత్వరంగా స్థలాలు ఇచ్చేందుకు వీలుంటుందని వివరించారు. గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు ఎన్నో ఏళ్లుగా రాజకీయ పలుకుబడితో ఆక్రమించిన పరిస్థితి ఉందన్నారు. పేదలకు చెందాల్సిన భూములు ఆక్రమణలకు గురైనట్లు స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ఫిర్యాదు అందాయని తెలిపారు. ఆయా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నేడు ప్రభుత్వ స్థలాలు,చెరువులు పరిశీలించామన్నారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను కొంతమంది డబ్బు, రాజకీయ పరపతితో ఫెన్సింగ్ వేసి ఆక్రమించినట్లు గ్రామస్తులు తెలిపారని వంశీ చెప్పారు. ప్రభుత్వ భూములు మొత్తం లా అండ్ ఆర్డర్ రెవెన్యూ యాక్ట్ ప్రకారం సర్వే చేయాలని ఆదేశించామన్నారు. సూరాయి చెరువు,పెరుమాళ్ళ కుంట, గంగినేని చెరువు, కొత్తచెరువులు పూర్తిగా ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామన్నారు. సాగులేని చెరువులను గుర్తించామన్నారు. ప్రభుత్వ భూమి పేదలకు చెందాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు మొత్తం సర్వే పూర్తి అయ్యాక రెండో దశ పేదలకు ఇళ్ళు స్థలాలు ఇచ్చేందుకే చర్యలు చేపడతామన్నారు. ముస్తాబాద శివారు వెదురు పవులూరు పరిధిలో ఆర్ఎస్ 308లో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు ఆక్రమంలో ఉన్న భూములను పరిశీలించామన్నారు. సూరంపల్లి శివారు ప్రాంతంలో జాస్తి ఆధీనంలో ఉన్న 12 ఎకరాల భూములను చూశామన్నారు. ఈ ప్రాంతంలో 56 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకుంటే గన్నవరం మండలంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు రెండు విడతలుగా ఇవ్వడానికి వీలు ఉంటుందని వంశీ వివరించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎంపీపీ అనగాని రవి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల అధ్యక్షులు పడమట సురేష్, వైసీపీ నాయకులు గొంది పరంధామయ్య, మేచినేని వెంకట శివ సత్యనారాయణ, సూరంపల్లి సర్పంచ్ బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

హంసలదీవిలో యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు

రాష్ట్రంలోనే ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన హంసలదీవి సాగర సంగమాన్ని సినిమా ఇండస్ట్రీలో ప్రముఖ ఫైట్ మాస్ గంజి శీను కుటుంబ సభ్యులు గురువారం సందర్శించారు. సముద్రం వద్ద స్నానాలను ఆచరించి, సాగర సంగమం అందాలను తిలకించారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గంజి మాట్లాడుతూ జయ జానకి నాయక చిత్ర షూటింగ్‌లో ఫైట్ మాస్టర్లు రామ,లక్ష్మణుల ఆధ్వర్యంలో జరిగిన ఫైటింగ్ సీన్లో తాను కూడా ఫైట్ మాన్ గా పని చేశానన్నారు. ప్రముఖ హీరోలు నటించిన సినిమాల్లో ఫైట్‌మాన్‌గా పనిచేశానన్నారు. రామలక్ష్మణ ఫైట్ మాస్టర్ల దగ్గర 5 సంవత్సరాల నుండి పనిచేస్తున్నట్లు తెలిపారు. సాగర సంగమం చాలా బాగుందన్నారు.

నీటితీరువా వసూళ్లపై నివేదిక కోరిన లోకాయుక్త

ప్రజాశక్తి-ఉయ్యూరు

రాష్ట్రంలో 2022-2023 సంవత్సరానికి (1432 ఫసలీ) నీటి తీరువా వసూళ్ల ఇప్పటివరకు ప్రారంభించని విషయమై రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిని నివేదిక కోరుతూ రాష్ట్రలోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 2022-2023 సంవత్సరానికి గాను 1432 ఫసలీ నీటితీరువా 2022 జూలై 1 నుంచి వసూలు ప్రారంభించాల్సి ఉండగా అందుకు ఏవిధమైన చర్యలు తీసుకోపోవడాన్ని రాష్ట్ర లోకాయుక్తకు 18-03- 2023న చేసిన ఫిర్యాదు మేర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిని నివేదిక కోరినట్లు శ్రీని వాసగౌడ్ తెలిపారు.

పంట కాల్వలో వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి-పెడన

పెడన పట్టణ శివారులోని బ్రహ్మాపురంలోని పంట కాలువలో వృద్ధుడి మృతదేహం కనిపించింది. అటువైపుగా వెళ్తున్న రైతులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడు బ్రహ్మాపురానికి చెందిన చేనేత కార్మికుడు కొండ బ్రహ్మానందంగా గుర్తించారు. ఇతను గత రెండు రోజులుగా కనబడటం లేదని వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చినట్లు తెలిపారు. ఇతనికి కొంచెం మతిస్థిమితం తక్కువ అని శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దేశం గర్వించదగ్గ ఇంజినీర్ డాక్టర్ కె.ఎల్.రావు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం)

ప్రముఖ ఇంజనీరు, విజయవాడ మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ కేంద్ర నీటిపారుదల, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ కెఎల్ రావు 37వ వర్ధంతి కార్యక్రమం



నివాళులర్పిస్తున్న నాయకులు

బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో జరిగింది. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు స్థానిక రైతులతో కలిసి కెఎల్ రావు చిత్రపటానికి పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, రైతు నాయకులు కసుకుర్తి అర్జునరావు, కసుకుర్తి సుభాష్ చంద్రబోస్, కొలుసు గంగాజలం, కనకవల్లి శేషగిరిరావు, పుసులూరు పూర్ణ వెంకట ప్రసాద్, ఆలపాటి రాంబాబు, కసుకుర్తి వేణుబాబు,మొవ్వ పూర్ణచంద్రరావు, కాట్రు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి ఇదేం ఖర్మ'కు స్పందన : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్రంలో ఒక అసమర్థ ప్రభుత్వ పాలనలో పేద, మధ్యతరగతి వర్గాలు దోపిడీకి గురవుతూ అభివృద్ధికి నోచుకోక అలో లక్షణ అంటూ ఆక్రందనలు పెడుతుంటే వారికి అండగా తెలుగుదేశం పార్టీ ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం కొల్లు రవీంద్ర నాయకత్వంలో నియోజక వర్గంలో చేపట్టడం జరిగిందని టిడిపి నాయకులు తెలిపారు. మచిలీపట్నం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గురువారం టీడీపీ నేతలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటివరకు దాదాపు ఇరవై వేల కుటుంబాలను ప్రత్యక్షంగా కలుసుకొని వారి సమస్యలను తెలుసుకొని వారికి వారికి ధైర్యాన్ని కల్పించామన్నారు. నవంబర్ 30 , 2022 నుండి ప్రారంభమై ఇప్పటివరకూ కొనసాగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథ్, ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకిశెట్టి నీరజ, కరెడ్ల సుశీల, దింటకుర్తి సుధాకర్, రెహమత్ అలీ, కంచర్ల మోహన్, నాయకులు పాల్గొన్నారు.

కొడాలి రామరాజు పుట్టినరోజు వేడుకలు

గుడివాడ : టిడిపి సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడాలి రామరాజు పుట్టినరోజు వేడుకలను మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో కొడాలి రామరాజు కేక్‌ను కట్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, సన్యాసిరావు, మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు అట్లూరి శ్రీరామప్రసాద్, చలసాని శ్రీధర్, పండ్రాజు సాంబశివరావు, పోలాసి ఉమా, గోవాద శివా, షయ్యద్ జబీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని తాడేపల్లి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను గ్రామ సర్పంచ్ పడమటి సీతామహాలక్ష్మి,



విత్తనాలను అందజేస్తున్న కృష్ణారావు

కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు తాతినేని వెంకట కృష్ణారావు, వైసీపీ నాయకులు పడమటి వీరకుమార్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. జనుము 15 క్వింటాళ్ళు, జీలుగ 5 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని, డిఏపి, యూరియా కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు తాతా సీతారామయ్య, విఎఏ అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఉయ్యూరు

కాటూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శు క్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీరు సీహెచ్ రాంబొట్లు తెలిపారు. కాటూరులో చింతల తోట జగనన్న కాలనీకి కొత్తగా విద్యుత్ లైన్లు వేస్తున్నందున కాటూరు, రాజుపేట, కడవకొల్లు, వీరవల్లి, పొట్లపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

గణిత సూత్రాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు

చిన్న గణిత సూత్రాలు తెలుసుకుని లెక్కలు తేలికగా చేయొచ్చునని గణిత ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు లెక్కల సూత్రాలు తెలియజేసి సులువుగా లెక్కలు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు సెలవులు సద్వినియోగం చేసుకునేలా పలుకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం : సర్పంచ్

ప్రజాశక్తి-పెదపారుపూడి

తాగునీటి సమస్యను వెను వెంటనే పరిష్కరించినట్లు ఈదులమద్దాలి గ్రామ సర్పంచ్ వంగర హిమబిందు విష్ణు కుమారి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యుత్ మోటార్ కాలిపోవడంతో వాటర్ ట్యాంక్‌కు నీటిని అందించటం ఇబ్బంది కరంగా మారిందన్నారు. వెంటనే స్పందించి ప్రజలకు తాగునీటిని సకాలంలో అందించినట్లు ఆ గ్రామ



పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు వంగర సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు

మండలంలోని తేలప్రోలు గ్రామ సచివాలయంలో హౌసింగ్ ఇఇ, ఎంపీడీవో అధ్యక్షతన పేదలందరికీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం జరిగింది. గృహ నిర్మాణం చేపట్టని లబ్ధిదారులను చైతన్యపరిచి ప్రభుత్వం ఇచ్చే రాయితీలతో కూడిన గృహ నిర్మాణ సామాగ్రితో పాటుగా పొదుపు సంఘాల నుండి ఇచ్చే రూ.35 వేల రుణంతో ఈజీగా సులువుగా బేస్మెంట్ లెవెల్ నిర్మాణం చేసుకోవచ్చని ఎంపీడీవో పేర్కొన్నారు. హౌసింగ్ ఇఇరామోజీ నాయక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఈ మెసేజ్‌ని గ్రామ సచివాలయ ఉద్యోగులు గ్రామ వాలంటరీలు అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామస్థాయి అధికారులు లబ్ధిదారులకు తెలియజేసి చైతన్యం తీసుకురావాల్సిందిగా కోరారు.


విద్యుత్ కోతతో కార్యాలయం బయటే వేచి ఉన్న సిబ్బంది, ప్రజలు

అప్రకటిత విద్యుత్ కోతతో కష్టాలు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండుతున్న భానుడితో పాటు అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ కోత విధిస్తుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం పనికి ఆటంకం ఏర్పడుతోంది. నిర్దిష్ట సమయం తెలియజేసి విద్యుత్ కోతలు విధించాలని ప్రజలు కోరుతున్నారు.


ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజినీర్‌గా నవీన్ గౌతమ్



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా పి నవీన్ గౌతమ్ గురువారం ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కెవి ఎస్ చక్రధర్ బాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సిఈగా పనిచేస్తున్న పి అశోక్‌కుమార్ రెడ్డి విద్యుత్ సౌధాలో జనరేషన్ చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ అయ్యారు. విద్యుత్ సౌధాలో కమర్షియల్ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నవీన్‌గౌతమ్ ఎన్‌టిటిపియస్ సిఈగా బదిలీపై వచ్చారు. గతంలో ఈయన ఎన్‌టిటిపియస్ ఏఈ ఏడీఈ స్టేజ్ 1 ఈఈ ఎస్ఈ 1 శిక్షణ కేంద్రం చీఫ్ ఇంజినీర్‌గా పనిచేశారు. గురువారం పి అశోక్‌కుమార్‌రెడ్డి భాధ్యతలను కొత్త సిఈ పి నవీన్‌గౌతమ్‌కు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్న నూతన సిఈకి ఇంజినీర్లు ఉద్యోగులు కార్మికులు అభినందనలు తెలిపారు.

40 లీటర్ల మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గంపలగూడెం: మండుతున్న ఎండల నేపథ్యంలో నిత్యం మజ్జిగ సేవిస్తే వడదెబ్బ నుండి కాపాడుకోవచ్చని



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామిశెట్టి జయరాజు పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు గాంధీ సెంటర్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 40 లీటర్ల మజ్జిగను బాటసారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని చెరువు బజార్ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 30 లక్షల రూపాయలతో ఊరచెరువును అనుకొని ఉన్న అలుగుపై నిర్మించనున్న నూతన బ్రిజి నిర్మాణ పనులకు బుధవారం రాత్రి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా స్థానిక 13, 15 వార్డు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్థానికుల అభ్యర్థన మేరకు 30 మీటర్లు పొడవు, 6 మీటర్లు వెడల్పుతో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి మహిళా ఫిడే రేటింగ్ చెస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: స్థానిక గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ గురునానక్ కాలనీ, విజయవాడ నందు రాష్ట్రస్థాయి మహిళ ఫిడే రేటింగ్ చదరంగం పోటీలను గురువారం ఎన్టీఆర్ జిల్లా మెజిస్ట్రేట్ అండ్ కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు జ్యోతి ప్రజ్వలన చేసి చదరంగం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదరంగం ఆడటం వలన విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు.. చదరంగం క్రీడాకారులు కూడా చేసే ప్రతి పని ఆలోచించి ఉన్నతమైనటువంటి విజయాలను అందుకుంటారని అన్నారు.. అంతేకాకుండా తల్లితండ్రులు క్రీడల పట్ల ఆసక్తితో తమ పిల్లలను రాణిస్తున్నారని, ఇటువంటి చదరంగం పోటీలకు సహాయ సహకారాలను అందిస్తున్నటువంటి రోటరీ మిడ్ టౌన్ మరియు గేట్స్ మేనేజ్మెంట్ వారిని అభినందించారు. టోర్నీ ఆర్బిటర్ ఎం. రాజీవ్ మాట్లాడుతూ చదరంగం పోటీలకు రాష్ట్రంలోని అన్ని మారుమూల ప్రాంతాల నుంచి 78 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు.. మొదటి రోజు రెండు రౌండ్లు జరగగా టాప్ సీడ్ ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిని ఉమెన్ ఫిడే మాస్టర్ లాస్య జి, అనంతపురం క్రీడాకారిణి అస్మిత ఏ. పై గెలుపొందగా రెండవ సీడ్ ప్రకాశం జిల్లా క్రీడాకారిణి ఉమెన్ ఫిడే మాస్టర్ కే సాయి నిరూపమా, ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిణి అయిన నారాయణ రిషిత పై గెలుపొందగా... మూడవ సీడ్ కృష్ణాజిల్లా క్రీడాకారిణి ఉమెన్ ఫిడే మాస్టర్ పి సుప్రీత అదే జిల్లాకు చెందిన కే శరణ్యపై గెలుపొందారని అన్నారు.. ఈ కార్యక్రమంలో రోటరీ మిడ్ టౌన్ విజయవాడ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ ప్రభు, కె ఎస్ ఎన్ బాబు, ఉపాధ్యక్షులు బి రామ్మోహన్ రెడ్డి, జి మురళీకృష్ణ గార్లు మరియు గేట్స్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్మెంట్ అండ్ సైన్సెస్ చైర్మన్ టి.కిషన్‌బాబు, టోర్నమెంట్ డైరెక్టర్ ఎం అనిత జిల్లా చదరంగం అధ్యక్ష కార్యదర్శులు ఎండి అక్బర్ పాషా మందుల రాజీవ్ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

టెన్త్‌లో ప్రతిభ చూపిన మల్లికకు సత్కారం



ప్రజాశక్తి-భవానీపురం: ఆంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీ వైష్ణవ రాష్ట్ర సంఘం కార్యాలయంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఎన్వి యశోద శేషగిరిరావు ఆధ్వర్యంలో పదవ తరగతి పరీక్షల్లో పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన చాత్తాద శ్రీవైష్ణవ బాలిక టి.మారుతి మల్లిక 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఏపీ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో గురువారం భవానీపురంలోని సంఘ కార్యాలయంలో చాత్తాత శ్రీ వైష్ణవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి. మనోజ్ కుమార్, డైరెక్టర్లు, సంఘ నాయకులు కేక్ కట్ చేసి విద్యార్థిని మారుతి మల్లికకు చిరుసత్కారము చేసి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇలాంటి ప్రతిభ ఉన్న బాల బాలికలకు కార్పొరేషన్ పరంగా, సంఘ పరంగా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నారాయణమూర్తి, డైరెక్టర్లు పురాణం లోకేష్, తండా గీతాంజలి, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు టి.పూర్ణయ్య మరియు సభ్యులు పాల్గొన్నారు.

మల్లాదికి మంత్రి ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ: సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి బాలత్రిపుర సుందరమ్మ ఇటీవల కన్నుమూసిన నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మల్లాది కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. విజయవాడలోని మల్లాది ఇంటికి వెళ్లిన మంత్రి ముందుగా సుందరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.



హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి-చందర్లపాడు : చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ వాసిరెడ్డి ప్రసాద్ ఇంటి ఆవరణలో డాక్టర్ కాప భాను ప్రసాద్ సౌజన్యంతో మాజీ సైనికుల అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్ మరియు సెక్రెటరీ ఎల్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వడదెబ్బకు హోమియోపతి మందులు మొదటరోజుగా 750 మందికి ఉచితంగా గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వాసిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత అధికంగా నమోదవుతుందన్నారు,ఎండలు ఎక్కువ ఉన్నందున చిన్నపిల్లలు,వృద్ధులు,గర్భిణీ స్త్రీలు,బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎండలో ప్రయాణించేటప్పుడు శీతల పానీయాలు ఎక్కువగా తీసుకోవాలని కోరారు. గొడుగులు, టోపీలు వాడాలని సూచించారు.



చంద్రాలలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని చంద్రాల గ్రామంలో గురువారం పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ గంగాధర్‌రావు, పంచాయతీ కార్యదర్శి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు ఎస్‌బిఐ రుణం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యంతో ఆయిల్ పామ్ రైతుల కోసం మొదటిసారిగా వినూత్నమైన ఫైనాన్స్ ఆఫర్‌ను ప్రారంభించినట్లు గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధి ఎం.కె. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఋణ ఉత్పత్తి, రైతులకు మైక్రో ఇరిగేషన్ సదుపాయాన్ని ఏర్పాటుచేయడానికి ఈపథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పొలాలను రక్షించడానికి ఫెన్సింగ్ ఏర్పాటుకు, ఆయిల్ పామ్ తోటల వద్ద గొట్టపు బావిని ఏర్పరచడానికి ఋణాలను పొందే విధంగాఈ ఈపథకాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి తమ సంస్థ ప్రయత్నిస్తుందని తెలియచేశారు.

21న జీ తెలుగు వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: సరికొత్త సీరియల్స్, రియాల్టీ షోలతో తెలుగు ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తున్న జీ తెలుగు ఛానల్ 18వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆర్.కె. కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈవార్షికోత్సవం సందర్భంగా పలువురు సినీ ప్రముఖులతో రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి ఛానల్లో ప్రసారమవుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్రతిభ గల యువతను వెలికితీసే విధంగా వినూత్నమైన కార్యక్రమాలతో ఆకట్టుకుంటున్న తమ సంస్థ రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కొండపల్లిలో వీధికుక్కల బెడద

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఏ వీధిలో చూసిన కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతున్నప్పటికి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 4 రోజులుగా కాస్తున్న ఎండలతో భయపడుతున్న ప్రజలకు ఇళ్ళలో ఉండలేక బయటకు వస్తే కుక్కలతో ఎక్కడ కరుస్తాయో అని భయపడుతున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలు బయట తిరగాలన్నా సైకిళ్ళు తొక్కాలన్నా కుక్కల దెబ్బకు హడలిపో తున్నారు. ఇదే క్రమంలో



గురువారం కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్‌లో పేపర్ వేసే బి కార్తిక్ అనే వ్యక్తిని కరవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. కొండపల్లి మున్సిపల్ కమీషనర్ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చినప్పటికి మున్సిపల్అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొండపల్లి ప్రజలు చాలామంది కుక్కకాటుకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి కాపాడాలని కోరుతున్నారు.